# చీకట్లో సముద్రం

సముద్రం సముద్రం వినీలసముద్రం విశాల సముద్రం కోటి కెరటాల నాలుకల తోటి - శోకటిపాట పాడినపాటే పాడే నిరంతరసముద్రం - జోరీగలాగ హోరెత్తే సముద్రం కాలకంఠుడిలాగ నోరుతెరచిన సముద్రం - కాలంకన్నా ముసలిది సముద్రం అన్నిటికన్నా అసలైనది సిసలైనది ఆది మూర్తి సముద్రం. సాగరం జీవితం జీవితం సాగరం. సత్యం చచ్చిందని నిత్యం రోదించే నితంతువు విహాయసపథంతో విలాసవంతంగా దాంపత్యంచేసే నిత్య పుణ్యస్త్రీ భూమిని మింగివేసే భూతం. తిమింగిలాలని కడుపులో పెట్టుకొని కెరటాల నురుగుని కక్కి వేస్తుంటుం. యుద్ధనౌకల ఔషధం వాణిజ్యనౌకల భోజనంచేసేభోగి. సాగరం గంభీరం. గంభీరం సాగరం.

సముద్రంతో మొదలైంది సృష్టికథ! సముద్రంతో అంతమవుతుంది సృష్టివ్యథ. సముద్రంలో జనించింది జీవం. సముద్రంలో పోతుంది ప్రాణం. నిప్పుని నీళ్లు తినేస్తాయి గాని, నీళ్లలో నిప్పు ఉంది. నీళ్లలో ఉప్పు ఉంది. ఉప్పు నాగరికతకి మొదటిమెట్టు. నీళ్ళలో ఉప్పుఉన్నట్టే నీళ్ళలో నాగరికత ఉప్పు పడుతుంది. అయినా సాగరంలో సాగరంతో సాగరంవల్ల పుట్టింది సృష్టికథ. అందుకే సాగరంగురించే ఈనాకథ.

సైకతస్థలాన చలిగాలిలో ఒరుసుకొని కూర్చొని ప్రియవచనాలు ఉత్తుత్తి తీపి పలుకులు కూడబలుక్కునే ప్రేమికులగురించి కాదు. వేసవికాలంలో వేరుశెనగకాయలు తింటూ కులాసా కుచ్చి టప్పాలుకొట్టే సోడా షోకిల్లాలగురించి కాదు. ఊళ్లో పడుక్కునడానికి పంచలేక నడచి నడచి అలసిపోయి ఇసుకతిన్నెమీద ఉత్తరీయం పరుచుకొని ఆదమరచి నిద్రపోయే నిరుద్యోగిగురించి కాదు. బాసలిచ్చినవాడు మోసగించితే కడుపులోని పాపని, మెడవి[illegible]పాపాన్నీ అవమానభారాన్నీ మోయలేక అర్ధరాత్రి అనాథల్ని ఆదరించే సాగరుణ్ణి వెతుక్కుంటూ వచ్చి నీళ్ళలోకి నడిచివెళ్లే వంచితురాలిగురించికాదు. అశుభం శుభం తెలియని అర్భకురాలిగురించి, అయిదేళ్ళ పాపగురించి, అతి చిన్నపిల్లగురించి.

నదీనాం సాగరోగతిః. ఈ చంటిపిల్ల వంట్లో నదులున్నాయి. సముద్రంతో లీనమవుదామన్న తహతహలున్నాయి. అయితే కొండల్లో పుట్టి మైదానంలోకి ప్రవేశించకముందే ఎండిపోయే నదులు. అతిచిన్న సెలయేరు. ఒక ముద్దువాగు. అకారణంగాపుట్టి అకాలంలో అదృశ్యమయ్యే జీవధార.

కథ ఎలా అంతమవుతుందో ముందే చెప్పేస్తున్నాకదూ. సస్పెన్సూ, డ్రామా, కొసమెరుపూ ఏమీ లేకుండా రాస్తే కథానిక కాదంటారు. అయితే జీవితంలో ఏం సస్పెన్సు ఉంది. జీవితం ఎలా ముగుస్తుందో అందరికీ తెలిసినదే. జాతస్యమరణం ధ్రువమ్. అనుకోకుండా అంతమవుతుందని అనుకుంటున్నారు కదూ. అందులో సస్పెన్సులేదని అడుగుతున్నారు. అవునా. అయితే అనుకొనేవాడు ఒకడున్నాడు. వాడు అడుగడుగునా వార్నింగ్ ఇస్తూనే ఉన్నాడు. వాడు పిడయితే ఆశ్చర్యం ఏముంది. వాడు సాగరుడు. వాడిలో ఐక్యంఅవడం ప్రాణానికి పరమావధి. ప్రాణం జీవనది. జీవం సాగరుడినే వెతుక్కుంటుంది. జీవం అభిసారిక. నా నాయిక అమాయిక.

ఆ ఊరికి సముద్రం అయిదుమైళ్ల దూరంలో ఉంది. అవును ఊరికి సముద్రమే అయిదుమైళ్ల దూరంలో ఉంది. ఏమంటే సముద్రం ముందుకు రాగలదు. తలుచుకుంటే వెనక్కి పోగలదు. కాని ఊరు - ఉన్న ఊళ్లోనే ఉండిపోవాలి. అందుకే సముద్రమే కనికరించి ఎప్పుడూ ఆ ఊరికి అయిదుమైళ్ల దూరంలోనే ఉంటున్నది. అందుకు సాగరానికి ఊరు సర్వదా కృతజ్ఞురాలు.

ఆ ఊళ్లో పాకలున్నాయి. గుడిసెలున్నాయి. గుళ్లున్నాయి బళ్లున్నాయి ఇళ్లున్నాయి. అయితే ఏవీ మూడు నిలువుల ఎత్తుకన్నా హెచ్చులేవు. ఎత్తు - మానవుడి చిత్తాన్ని తెలియజేస్తుంది. ఔన్నత్యం వాడి పరమావధి. అయినా ఆ ఊళ్ళో రెండతస్తులమేడ ఒకటే ఉంది. ఆ మేడలో ఒక ప్లీడరుంటున్నాడు. ఆ ప్లీడరుకొక గుమస్తా ఉన్నాడు. ప్లీడరుకు ప్రాక్టీసు ఉంది. మంచిరాబడి ఉంది. మేడలో ప్లీడరుంటున్నాడు. ఒక పెంకుటింట్లో గుమస్తా ఉంటున్నాడు. మేడ ప్లీడరు స్వంతం. పెంకుటిల్లు గుమాస్తా స్వంతం కాదు. అద్దె కొంప.

ప్లీడరుగారన్నా - ప్లీడరుగారి మేడన్నా ఊళ్ళో అందరూ గౌరవంగా చూస్తారు. గుమాస్తాని ప్లీడరుగారి గుమస్తా అనే అంటారు. గుమస్తాకి ఇది బాధ. ప్లీడరూ తనూ చిన్నప్పట్నుంచీ స్నేహితులు. పెద్దయ్యాకకూడా స్నేహితులే. యజమాని నౌకరు అనే సంబంధం వాళ్ళమధ్య లేదు. ఊళ్లో ఉంది. అందుకే గుమస్తాకి మనసులోనే ఈబాధ ఉంది. ఆబాధ ఉన్నట్టు కూడా గుమస్తాకి చైతన్యంగా తెలియదు. అవ్యక్తంగా లోలోపల లోపల ఏదో ఈసు. తగని ఈర్ష్య. ఎత్తుకి ఎగరాలని ఆశ. సమాన హోదాలో ఉండాలని తాపత్రయం. తలదన్నాలని కోరిక. తప్పేం లేదు. అవకాశం రావాలి.

ఆదిలో ప్లీడరుగారికొక కూతురుంది. గుమస్తాకి లేదు. ప్లీడరుగారికి గుర్రబ్బండీ ఉంది. గుమస్తాకి లేదు. ప్లీడరుగారికూతురు గుర్రబ్బండీలో షికారు వెళుతుంది. గుమస్తాకి ఈ సరదా లేదు. ఎనిమిదోవీడు రాగానే

ముఖచిత్రం : "రుఖ్ సానా" హిందీచిత్రంలో మీనా కుమారి, వహీదా.


| | |
|---|---|
| చీకట్లో సముద్రం— | 2 |
| ఉదయకిరణాలు— | 5 |
| కాలవాహిని— | 10 |
| విజ్ఞానవీథులు— | 12 |
| అపస్వరాలు (సీరియల్)— | 13 |
| ఆఖరి తప్పు— | 19 |
| వనితాలోకం— | 30 |
| కిక్ టెక్— | 33 |
| బాలసాహితి— | 35 |
| కథాగేయ సుధానిధి— | 36 |
| స్కార్లెట్ పింపర్నల్ (సీరియల్) | 38 |
| అల్లరి పిల్లలు— | 43 |
| ప్రాణాలొడ్డిన పందెము— | 45 |
| సినిమా— | 50 |

ప్లీడరుగారు కూతురికి పెళ్లి చేశాడు. ఊరంత పందిరివేశాడు. ఊరంతా అందులోనే ఉంది. అయిదురోజులు. ఆనందం. పండుగ. అదంతా గుమస్తా తన చేతిమీదుగానే చేశాడు. తనకి కూతురు లేదు. తను పెళ్లిచేయటంలేదు. అయినా ప్లీడరుకూతురు పెళ్లిఖర్చులన్నీ - ఏర్పాట్లన్నీ తనచేతిమీదుగానే జరిగాయి. ఇది బాధాకరం.

ప్లీడరు కూతుర్ని అత్తవారింటికి పంపించాడు. వంద కావిళ్ళసారె పెట్టాడు. పందిరిపట్టె మంచం - వంద రవివర్మ పటాలు - నాలుగు అద్దాల బీరువాలు. పది సంవత్సరాలకి సరిపొయ్యేపాత్ర సామాగ్రి. రెండు ఫర్లాంగుల ఊరేగింపు ఆసారె. తన ఇంట్లో ఎన్ని వస్తువులున్నాయో అన్ని సాత్రీలు కొత్తవి తెప్పించి సారెపెట్టాడు. ఇవ్వన్నీ ప్లీడరుగారి కూతురు కోసం గుమస్తాయే కొన్నాడు. కూలీల తల కెత్తించాడు. వీధిలో నడిపించాడు. సారె పంపించాడు. ఏదీ తన కూతురు. ఏది తన ముద్దూ ముచ్చటా ఏదీ తన వైభవం?

ప్లీడరు తనస్నేహితుడు. బాల్యమిత్రుడు. తనని నిశ్శబ్దంగా అదృశ్యంగా వెక్కిరిస్తున్నాడు ఈసడిస్తున్నాడు. మోసగిస్తున్నాడు. గుమాస్తాకి పదేళ్లనుండీ ఈ బాధ ఉంది అంగుకే ప్లీడరుగారి కూతురి పెళ్లి మాటలనుంచీ గుమాస్తా పగతీర్చుకోడానికి పట్టు పట్టాడు. కూతురు ముచ్చటలతో తనని మోసగిస్తున్న ప్లీడర్ని తనే మోసగించడం మొదలెట్టాడు. డబ్బు తినేయడం ఆరంభించాడు.

డబ్బు తినడం మొదలు పెట్టిన వాళ్లకి ఇంకొకటి రుచించదు. పొద్దున్నే పచ్చి మంచినీళ్లు పుచ్చుకోడానికి ముందు విచ్చు రూపాయి నమిలి మింగితేనేగాని వాడికి తెల్లవారదు. పొద్దు పొడిచిన క్షణంనుండి పొద్దు గడిచే క్షణందాకా గంటలని రూపాయలతో తింటేనేగాని వాడికి తృప్తి ఉండదు.

ప్లీడరు ఇంటి ఖర్చులన్నీ గుమాస్తా చేతిమీదుగానే అవుతాయి. పావలా బంగాళా దుంపలు కొంటే అయిదణాలు పద్దురాస్తే పుట్టిమునిగిపోదు. పట్టుకో నేవాళ్లు ఉండరు. ఇంటికొక పుష్పం ఈశ్వరుడికొక మాల. రోజుకోరూపాయి కాజేస్తే పదేళ్ళలో సంపద. ప్రతిరోజూ మోసగిస్తూ ప్లీడరుమీద గుమస్తా పగతీర్చుకొంటున్నాననుకొన్నాడు గాని పదేళ్ళలో కాజేసిన డబ్బు చూస్తే గుమాస్తా గుండె బరువెక్కింది. ఇంత డబ్బు ఏం చేసుకోడానికి? ఎవరు అనుభవించడానికి? ఏది తన కూతురు? ఏది తన ముద్దూ ముచ్చట? ఏది తన వైభవం?

ఇంత డబ్బు మూలుగుతున్నదే - కూతురుంటే గుర్రబ్బండీ కొని పెట్టవచ్చే - షికారుకు తీసుకెళ్లవచ్చే - ఊరంత పందిరివేసి ఊరంత అందులో వుండేట్టు చేయవచ్చే బజారంతా కొని సారెపంపవచ్చే ఏదీ తన కూతురు?

గుమస్తా ఆవేదన గుండెలు తరిగే ఆవేదన. అతడిలో దుఃఖం ఏరులు పారింది. వరదలు అయింది. అతడిలో సముద్రం ఉంది. ఆ సముద్రానికి విరామం లేదు. ఒకటే హోరు. ఒకటే రోదన. నిలువెత్తు పొంగు. కదలివచ్చే కడలిపొంగులు. కడలిలో హాలాహాలం పుట్టింది. హాలాహాలం దహిస్తుంది. ఆతరువాత వెంటనే అమృతం పుడుతుందా?

గుమస్తాకి సంతానం కలిగింది. కూతురు కాదు. కొడుకు. నయం. ఎవరో ఒకరు. అదృష్టం ఉండాలిగాని: అనేలేదు. ఏడాది తిరగకముందే శిశువు కన్ను మూశాడు. గుమాస్తా విన్నుపొడిచినట్టు - కడలిలో హాలాహాలం పుట్టినతరువాత కల్పవృక్షం - పుట్టిపోయింది. కామధేనువు పుట్టింది. గుమాస్తాకి మరొక సంతానం కలిగింది. అదీ ఏడాదిలో పోయింది. ఏడుకానుపులు. ఏ ఒక్కట్టి దక్కలేదు. ఎంతమథన - ఎంత వేదన - ఎంతరోదన. ఎనిమిదో కాన్పు - చిన్నవన్నెలకంగు వన్నుదన్ని సుధాశ్రీ పొడిమిన చెలువ. బిడ్డ దక్కింది. తల్లి పోయింది.

ఒక్కగానొక్క కూతురు. అపురూపం. గారాబం. అల్లారుముద్దు - ఓహో ఇది తన కూతురు. ఇది తనముచ్చట - ఇది తన వైభవం. ఇదే తన చిరకాలతపన - తపనీయ రచన. ఇందుకొరకే జీవించాడు. ఇందుకొరకే జీవిస్తాడు. ప్లీడరుగారికే కాదు. తనకీ ఉంది కూతురు. తనకూతురు గుర్రబ్బండీలో షికారు వెడుతుంది. తనకూతురికి రంగరంగా వైభవంగా తనూ పెళ్లి చేస్తాడు.




ఆనందమే జీవితమకరందం..

పొత్తికడుపుకు సంబంధించిన శూల, అతిసారం మొదలైన బాధలతో మీరొదైనందిన కార్యక్రమం పాడుచేసుకోవద్దు. ఓమం కర్పూర్ తీసుకుంటే ఈబాధపడ నవసరంలేదు. దానిలోనున్న గుణములు వెంటనే బాధోపశమనం కలిగించిమీకు మంచిఉత్సాహం చేకూర్చును. అనేకమంది స్త్రీలను వేధించుఋతుసంబంధమైనజబ్బులుగూడ ఈ ఓమం కర్పూర్ తో మటుమాయం అవుతాయి. ఎంత వయస్సులో వున్న వారైనా ఈఅద్భుతమైన ఔషధం నిరపాయంగా తీసుకోవచ్చును.

హెన్రీస్
ఓమమ్-కర్పూర్

తయారు చేయువారు:
లిటిల్స్ ఓరియంటల్ బామ్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ మద్రాసు - 1

# ★ చీకట్లో సముద్రం ★

సగతీర్చుకొంటాడు. పాపకి ఎవరూ చెయ్యనంతగా ముద్దుచేస్తాడు.

తనకి పాప పుట్టినప్పుడే ప్లీడరుగారికి మనవడు పుట్టాడు. ఆ అబ్బాయీ పాపా స్నేహితులు. ఆటలేస్తారు. ఆడుకొంటున్నప్పుడు అబ్బాయి అన్నాడు "మా తాతగారిమేడ పెద్దమేడ. మీ ఇల్లు చిన్న ఇల్లు." పాప 'మాకూ ఉంది పెద్దయిల్లు' అని అంది. ఏదీ చూపించమన్నాడు అబ్బాయి. పాప నాన్న దగ్గరికెళ్ళింది. 'మన పెద్దఇల్లు ఏదీ?' అని అడిగింది. గుమస్తాకి అంతవరకూ ఇది తట్టనేలేదు. ఊళ్ళో అంతా ప్లీడరుగారిమేడ గురించే చెప్పుకొంటారు. తను ప్లీడరుతో సరిసమానంగా అన్నివైభవాలు జరుపుకుంటూ, అన్ని ముచ్చటలూ తీర్చుకొనబోతున్నాడు. అయితే తనగురించి గొప్పగా చెప్పుకొందికి మేడలేదు. తనకి మేడ కావాలి. తనకూతురు సగర్వంగా దాని గురించి చెప్పుకోవాలి. ప్లీడరుగారికి రెండంతస్థులమేడే ఉంది. తను మూడంతస్థులమేడ కట్టించాలి. అప్పుడు ఊళ్ళోకల్లా ఎత్తయిన స్థానం తనకి కావాలి. మేడ కట్టిస్తేనేగాని తన చిన్నతనాన్ని - ప్లీడరుకన్నా తన ఎక్కువతనాన్ని లోకం గుర్తించదు. తన కూతురు కోరిక సిద్ధించదు. తనకి ఆనందం లభించదు.

విశాలమైన నివేశన స్థలం కొన్నాడు. లోతైన పునాదులు తీయించాడు. శంఖుస్థాపన చేశాడు. పాలికమంది తాపీ మేస్త్రీలను పెట్టాడు. మూడు నెలల్లో మూడు అంతస్థుల మేడ కావాలన్నాడు. పాపకి మూడు నెలలదాకా ఎలాగైనా మరపింతాలు పెట్టాలి. అంతదాకా ఆ అమ్మాయి ప్లీడరుగారి మనవడితో ఆడుకోకూడదు. ఆ తరవాత ఫరవాలేదు. ఊళ్ళోకల్లా పెద్ద మేడ మాదే అని అప్పుడు పాప చెప్పగలదు. అంతదాకా - అంతదాకా పాప వేరే ఆడుకోవాలి. అందుకు ఏర్పాట్లు చెయ్యాలి.

చేశాడు పాపకి చక్కటి స్నేహితుడు దొరికాడు. ఆ స్నేహితుడు సాగరుడు, సముద్రాన్ని చూశాక పాపలో ఆనంద సముద్రం ఉప్పొంగింది. సముద్రం సముద్రం వినీల సముద్రం - విశాల సముద్రం - కోటి కెరటాల తీగల విపంచిక - పాటపాడే ఉస్తాదు. ఆటలాడే దోస్తు - తరంగాలు పాపలేత పాదాలని స్పృశించి అభివందనం చేసి - మహారాజ్ఞి సముఖంలో అభిముఖంగా కనబడుతూ వెనక్కి నడిచే సామంతుల లాగా సెలవు తీసుకొంటాయి. ఇసుక తిన్నెలమీద పిచుక గురించి దిక్కులేని పక్షులకోసం పాప గూళ్ళు కడుతుంది. తటాకాలు నిర్మిస్తుంది. రత్నాకరుడు కనికరించి తీరాన విరజిమ్మిన వెలలేని రత్నాలని సేకరిస్తుంది. చిన్న చిన్న శంఖాలు, ఆలిచిప్పలు, చందమామలు, పలకపుల్లలు, మహాసంపద - అన్నీ పాపకోసమే సాగరుడు ఒడ్డున పడేస్తున్నాడు. సాగరుడు మంచివాడు. చక్కటి చెలికాడు.

మూడు నెలలు దాటాయి. మూడంతస్థుల మేడ లేచింది. గుమస్తా మనసులో ఆశా పుష్పం పూచింది. సంతృప్తి మారుతం వీచింది. పాపని తీసుకొచ్చాడు. మేడ చూపించాడు. పాప మూడో అంతస్తు ఎక్కింది. చుట్టూరా చూసింది. "ఎలా ఉందమ్మా మేడ?" అని అడిగాడు. "నాన్నా! సముద్రం కనబడటం లేదే" అని పాప నిరుత్సాహం వెలిబుచ్చింది. నిజమే- మూడో అంతస్తునుంచి సముద్రం కనబడ్డం లేదు. గుమస్తా - తాపీవాళ్ళని పిలిచాడు. సముద్రం కనబడేదాకా అంతస్తులు కట్టమన్నాడు. 'సముద్రం మన ఇంటినుంచి కనబడుతుందమ్మా - ఏడవకు!' అని కూతుర్ని సముదాయించాడు.

నాల్గో అంతస్తు కట్టారు. సముద్రం కనబడలేదు. అయిదో అంతస్తు కట్టారు. సాగరుడు కనబడలేదు. ఆరో అంతస్తు కట్టినా అంతే. ఏడోది పెంచారు. కనిబడింది. సముద్రం - వినీల విశాల సముద్రం. విలాస విలోల సముద్రం. కోటి కెరటాల నాలుకల చీటా - నిరంతరగానంచేసే నీలాలసముద్రం- కోరికలాగ కాలరాత్రే సముద్రం. ఏడో అంతస్తుమీదనుంచి నిద్రపోతున్నట్టు నిశ్చలంగా, బుద్ధిగా నీలంగా కనబడింది.

గుమస్తా పాపని ఏడోఅంతస్తుమీదకి తీసుకెళ్ళాడు. సముద్రాన్ని చూపెట్టాడు. పాప ఆనందానికి మేరలేదు. సంతోషంతో గెంతులేసింది. చప్పట్లు చరిచింది. సముద్రాన్ని పిలిచింది. సముద్రుడు సయ్ అన్నాడు. పాప పొంగిపోయింది. పాప పొంగిపోవడంచూసి గుమస్తా పొంగిపోయాడు. ఏడో అంతస్తుమీద ఆడి ఆడి అలసిపోయింది. నిద్రపోయింది. నిద్రపోతున్న పాపను ఎత్తుకొని గుమస్తా అద్దెయింటికి వచ్చాడు. పాపని పడుకోబెట్టాడు. మేస్త్రీలను పిలిచాడు. నాగం రోజుల్లో గృహప్రవేశానికి వీలుగా పనులన్నీ పూర్తి చెయ్యమన్నాడు.

పాప నిద్రపోతున్నది. నిద్రలో సముద్రాన్ని తలుచుకొంది. సముద్రంతో ఆడుకొంది. దానిగొంతుతో గొంతు కలిపి టపా పాడింది. తరంగాల ఊయలమీద ఊగులాడింది. చిరుచేపలతో ఊగులాడింది. నిద్రలో నవ్వుకొంటున్న పాపని చూసి గుమస్తా సంబరపడ్డాడు.

చీకటిపడ్డది. పాప యింకా నిద్దర లేవలేదు. గుమస్తా లేపలేదు. రాత్రి అలముకొనడం మొదలెట్టింది. చుక్కలు కనబడడం - మేఘాలు విచ్చుకొనడం - నిశి ప్రాకింది. పాప నిద్దరలో చక్కని కల కంటున్నది. గుమస్తా పక్కింటికి వెళ్ళాడు. పాప కలగంటూనే ఉంది. కలలో సముద్రుడు పాపని లాలించాడు. మిఠాయి తినిపించాడు. బొమ్మలు కొనిపెట్టాడు ఒక బొమ్మ ఎంచక్కా ఉంది. అంత మంచి బొమ్మని ఇచ్చిన సముద్రుడు ఎంత మంచివాడు!" "నాదగ్గర ఎంచక్కని బొమ్మ ఉందో" అని ప్లీడరుగారి మనవడికి చూపించింది. వాడు ఆ పిల్ల చేతుల్లోంచి దాన్ని లాక్కుంటున్నాడు. తను ఇవ్వటంలేదు. ఈ పెనుగులాటలో బొమ్మ పడిపోయింది. విరిగిపోయింది. సముద్రుడితో తను చెప్పుకొని ఏడిచింది. అంతకన్నా పెద్ద బొమ్మను సముద్రుడు ఇస్తానన్నాడు. తెస్తానని వెళ్ళిపోయాడు. ఇంకా రాలేదు. ఏడీ సముద్రుడు ఏడీ ఆట చెలికాడు? పాపకి తెలివొచ్చింది. ఇంట్లో అద్దె కొంపలో చీకటిగా ఉంది. బయటకి వచ్చింది. చీకటిగాఉంది. ఏడంతస్థుల మేడదగ్గరికి వెళ్ళింది. చీకటిగా ఉంది. ఏడో అంతస్తు ఎక్కింది. చుట్టూరా చూసింది. చీకటిగా ఉంది. చీకట్లో సముద్రుడు కనబడడం లేదు. పాప పిలిచింది. చీకటిగాఉంది. సముద్రం కనబడడం లేదు. పాపగోడ ఎక్కింది. చీకటిగాఉంది సముద్రుణ్ణి పిలిచింది. చీకటి గా ఉంది.

ఆ తరవాత అంతా చీకటే - గుమాస్తా జీవితం అంతా చీకటే. ఏడంతస్థుల మేడ పూర్తిగా చీకటే.

సముద్రంలో లీనమవుదామనుకొన్న నది సముద్రాన్ని చేరకముందే ఎండిపోయింది. పిల్ల వాగులు పెద్ద పరుగులు పరుగెత్తలేవు. మహానదులకుగాని సాగరసంగమంచేసే మహాదృష్టం పట్టదు. కాని ఏజన్మలోనో నోములు నోచుకొన్న చిన్నచిన్న వాగులు - పెద్ద నదిఒడిలో చేరి సముద్రస్నానానికి వెళతాయి. అయితే చీకటి కాటుక అలముకొంటే - కన్ను పొడుచుకొన్నా తెన్ను తెలియకపోతే, చీకటిలో సముద్రం కనిపించదు. వినిపిస్తుంది. అంతే!

(రేడియో ప్రసారితం)

